# నిర్ణయం

**-వేలూరి కౌండిన్య**

అమ్మా శాలూ బందరు వాళ్ళు ఫోన్ చేస్తే ఏం చెప్ప మంటావు! అమ్మను అడగండి నాన్నగారూ అంది. అమ్మ సంగతి సరే నీ సంగతి ఏమిటో కనుక్కుందామని కదా అడుగుతుంటా! వంట ఇంట్లో నుంచి పార్వతి అరుస్తోంది. ఇంటి కప్పు ఎగిరిపోయేటట్లుగా. ఇన్నాళ్ళు- వెతికి- వెతికి మీరు తెచ్చిన సంబంధం ఇదా! పుట్టు దరిద్రపు కొంపలో పిల్లను ఇవ్వటానికి మీకు మనస్సు ఎలా ఒప్పిందండి! ఎవరన్నా దాని ఫ్రెండ్స్ అడిగితే మీ ఆయన ఏం చేస్తాడే అంటే తద్దినాలు పెట్టిస్తాడు అని చెప్పాలా- మీ నిర్వాకం మండినట్లే ఉంది. పిల్లకు మంచి సంబంధం తీసుకు రావడం మీ వల్ల అయ్యే పని కాదు కానీ ఆ పని ఇంకెవరికైనా పురమాయించండి. ఆవిడ మాట్లాడటం మొదలుపెట్టిందంటే ఇంక కామాలు ఫుల్‌స్టాపులు ఉండవు. సందర్భం లేకుండా ఏ విషయం గురించైనా గంటల తరబడి వాదించగలదు. ఎదుటివాళ్ళు ఏమన్నా అనుకుంటారేమోనని కూడా చూడదు. తల్లి కేకలు వేయడం చూసి కూరలు, కత్తిపీట పక్కనపెట్టి మరో గదిలోకి వెళ్ళిపోయింది.

పార్వతి ఎదుటి వాళ్ళను ఆక్షేపించటంలో అఖండురాలు. ఎటువంటి వాళ్ళకైనా వంకలు పెడుతుంది. ఎదుటివాళ్ళు తనకు ఇష్టం లేకపోతే చీమంత సమస్యనైనా ఏనుగుతో పోలుస్తుంది. అదే ఎదుటివాళ్ళు నచ్చారనుకోండి, వాళ్ళలో ఎన్ని లోపాలున్నా ఈ రోజుల్లో లోపాలు లేనివాళ్ళు ఎవరు అని తేలికగా కొట్టిపారేస్తుంది.

నరసింహారావు ఒక ప్రైవేటు కంపెనీలో అకౌంటెంటుగా పనిచేస్తాడు. నిఖార్సైన మనిషి. తనకు ఎంత తెల్సినా ఎదుటివాళ్ళు చెప్పేదంతా సావధానంగా వినే సహృదయుడు. తాత, తండ్రులు బాగా బతికినా చివరకు మిగిల్చిన చిన్న ఇంటిలోనే గుట్టుగా కాపురం చేసుకుంటున్నాడు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. ఆడపిల్లలు ఇద్దరు మంచి తెలివితేటలు, తండ్రి వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకున్నవారు కావటంతో ఆహార వ్యవహారాలలో చిన్న చిన్న అసంతృప్తులు ఉన్నా చదువు విషయంలో అశ్రద్ధ చేయకపోవడంతో ప్రతి క్లాసు తప్పకుండా మంచి మార్కులతో పాసవుతూ ఒకరు డిగ్రీని, మరొకరు చివరి సంవత్సరం చదువుతున్నారు.

నరసింహారావుకు పిల్లలంటే వల్లమాలిన ప్రేమ. పెద్ద పిల్ల విశాలాక్ష్మి నిండు గోదావరి. రెండో పిల్ల శాంతి ఉప్పెన గోదావరి. అందుకే ఇద్దరి విషయంలో వాళ్ళ మనసెరిగి ప్రవర్తిస్తాడు. అది భార్య పార్వతికి నచ్చదు. నరసింహారావుకు పగలంతా ఉద్యోగంతోనే సరిపోతుంది. చీకటి పడగానే ఇంటికి వస్తాడు. పెళ్ళామనే పేరుకే పార్వతి ఉంది. ఆవిడతో రెండు మూడు గంటల కన్నా సహజీవనం చేయడం సాధ్యంకాదు. ఇది తనకి అనుభవం మీద తెలిసిన సంగతి. అతను రచ్చలో గెలిచాడు ఇంటిలో పరాజితుడు.

తమకు కలిగిన ఇద్దరు ఆడపిల్లల్ని ఇద్దరూ పంచేసుకున్నారు. పెద్ద పిల్ల అమ్మ పక్షం, చిన్నపిల్లకు నాన్న మాట అంటే గురి.

❖ ❖ ❖

నరసింహారావు ఏదైనా సందర్భం వచ్చినప్పుడు నీ ముద్దుల కూతురు అంటే అది విశాలాక్షి గురించి అన్నమాటే. మీ స్టాంపు అంటే అది కచ్చితంగా "శాంతి"ని గురించే. తాను మానసికంగా, దృఢంగా, బలంగా ఉండేందుకు శాంతి చాలా ఏళ్ళు కృషి చేసింది. హిందీకి సంబంధించిన అన్ని పరీక్షలు- ఇంకా ఇంటి దగ్గర ఉండి చదువుకోదగిన చిల్లర మల్లర పరీక్షలు అన్నీ చదివేసింది. ఒకటీ రెండూ స్త్రీల పత్రికలు, వ్యాసాలు, స్త్రీలకు సంబంధించిన విషయాల గురించి చక్కటి భాషలో రాస్తుంది. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూ దానికి సంబంధించిన నోట్స్ రాసుకుంటూ ఉంటుంది.

విశాలాక్షి తల్లి చాటు పిల్ల. ఏది కావాలన్నా అమ్మ మీద ఆధారపడుతుంది. తిండి దగ్గర నుంచి బట్టల దాకా అన్నీ అమ్మ చెప్పినట్లు వినాల్సిందే. ఆయనకేం అసాధ్యుడు గుండెల మీద కుంపటిలా ఇద్దరు కూతుళ్ళు ఉన్నా తలుచుకుంటే ఈ క్షణంలో పెళ్ళిళ్ళు చెయ్యగలడు అని స్నేహితులు ప్రత్యక్షంగా పరోక్షంగా అంటుంటే నరసింహారావుకు కించిత్ గర్వం కలిగేది. అతని ఎరుకలో చాలా మంది మిత్రులకు పెళ్ళిళ్ళలో మధ్యవర్తిగా ఉండి ఉభయ పక్షాలలో గొడవలు లేకుండా పెళ్ళిళ్ళు జరిపించేవాడు. బంధువుల ఇళ్ళల్లో ఎవరింట్లో

పెళ్ళిళ్ళు జరుగుతున్నా మొదటి శుభలేఖ ఇతనికే అందేది. పందిళ్ళు వేయించడం దగ్గర నుంచి శుభం కార్డు దాకా అన్నీ ఒక నిర్దిష్టమైన ప్లాన్ ప్రకారం జరిపిం చేవాడు. ఎక్కడ వేయాల్సిన తాళం అక్కడ వేస్తూ...

రెండు ఏళ్ళుగా విశాలాక్షికి సంబంధాలు చూస్తున్నాడు. మంచి ఉద్యోగం ఉంటే బుద్ధి మంచిది కాదు, గుణం బాగుంటే జానా బెత్తెడు జీతం. పార్వతి ఎప్పుడూ గొణుగుతూ ఉండేది. విశాలాక్షికి పాపం ఏమీ తెలియదు. ఒట్టి అమాయకురాలు. మీ స్టాంపు ఉందే అది గడుసు పిండం అని దాన్ని అంటూ విశా లాక్షి అంటే తండ్రికి అసలు ఇష్టం ఉండదని పార్వతి ఎప్పుడో నిర్ణయించేసుకుంది. ఆమె తరఫు నుండి బలమైన సాక్ష్యాధారాలు పోగుచేసుకుంది. ఊళ్ళో వాళ్ళకందరికీ సంబంధాలు కుదుర్చుతూ తన కన్న కూతురి విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడు అని ఆడిపోసుకునేది.

ఒకటి రెండు సంబంధాలు వచ్చినా వాటిని మొగ్గలోనే తుంచేసింది. వాడిని చూస్తే పెళ్ళానికి తిండి కూడా పెట్టే వాడిలా లేడు, అత్తగారిని చూడండి దెయ్యం మొఖం వేసుకొని ఎలా చూస్తూందో, ఇంకా ఇలాంటివే పనికిరాని కారణాలు చెప్పి వెనక్కి పంపేసింది.

పార్వతి నరసింహారావులు పాతికేళ్ళ వైవాహిక జీవితంలో మాట్లాడుకున్నది తక్కువ. పార్వతి ఎప్పుడూ పోట్లాడినట్లే ఉంటుంది. శాంతి అసలు వీళ్ళు ఇన్నేళ్లు ఎలా కలిసి నడిచారా అని ఆశ్చర్య పడిపోతూ ఉం టుంది. ఏ విషయం మాట్లాడినా ఆమె మాటల వెనుక ఏదో విద్వేషం దాగినట్లు శాంతికి అనిపించేది. తండ్రి మీద ఉన్న అలివికాని మమకారం కావచ్చు.

విశాలాక్షికి ఓ సంబంధం వచ్చింది అని అనే కంటే నరసింహారావు తీసుకువచ్చాడు అనటం బాగుం టుంది. వరుడు డిగ్రీ దాకా చదివాడు కంప్యూటర్‌కు సంబంధించిన రెండు మూడు కోర్సులు చేశాడు. ఉద్యోగ ప్రయత్నాలలో విసిగి వేసారి ఆచారంగా వస్తున్న తమ వైదిక విద్యను భుక్తిగా చేసుకున్నాడు. ఎలా లేదన్నా నెలకు నాలుగు, ఐదు వేలు సంపాదిస్తాడు. మంచి స్ఫుర ద్రూపి. అంతకు మించి భగవంతుడు మంచి స్వర సంపదను ఇచ్చాడు. ఆ అబ్బాయి ఆస్తి గురించి ఘనంగా చెప్పుకోవటానికి ఏం లేదు. బందరులో నాలుగు గదుల ఇల్లు తప్ప చరాస్తులు ఏమీ లేవు. అతనిపై పెద్ద కుటుంబాన్ని పోషించే బాధ్యత ఉంది. అతని అన్నగారు నాలుగైదేళ్ళ క్రితం ఒక ప్రమాదంలో మరణించాడు. ఆయన ఉన్నంతమటుకు వాసుగ్రాసా లకు లోటు లేకుండానే గడిచేది. అవధాని చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో అన్నగారే విద్యాబుద్ధులు చెప్పించారు. ఆయన ఆకస్మికంగా చనిపోవడంతో కుటుంబ భారమంతా అతనిపైనే పడింది.

"నేను కలుగజేసుకోకుండా ఉంటే నా అన్న కుటుం బం అంతా వీధిన పడుతుంది. నాకు కట్నం తీసుకోవా లన్న ఆశ లేదు. మీ దగ్గర తీసుకున్న 50 వేల రూపాయ లలో మా అన్నగారి పిల్లాడి చేత ఏదైనా వ్యాపారం చేయిస్తా. నా మీద కాస్త భారం తగ్గుతుంది. అందుకు మీకు ఇష్టం లేకపోతే వడ్డీ లేకుండా అప్పుగా ఇవ్వండి. నెమ్మదిగా తీర్చేస్తా. అందుకు మీరు ఒప్పుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు" అని అవధాని పెళ్లి చూపులకు వచ్చినప్పుడు కుండ పగలేసి చెప్పాడు.

అతను వెళ్ళడానికి లేచినపుడు మా అమ్మాయిని సంప్రదించి మీకు ఏ విషయం చెపుతాను అన్నాడు నరసింహారావు చేతులు జోడించి. పార్వతి ఎంతో ప్రయత్నం మీద తనను తాను నిగ్రహించుకుంది. అతను గుమ్మం దాటగానే బ్రహ్మాండం బద్దలైంది.

ఛీ.. ఛీ... ఎంత నాగరికత లేని మనిషి. తద్ది నాలు పెట్టి పెళ్ళాన్ని పోషిస్తాడట. ఆ మాత్రానికి 50 వేలు ఇవ్వాలట.. మీ కూతురినిస్తే ఇచ్చుకోండి. ఆ విషయం మళ్ళీ నా దగ్గర ప్రస్తావన తెచ్చారో మర్యాదగా ఉండదు. నేను, నా కూతురు ఈ సంబంధానికి చచ్చినా ఒప్పుకోము అందావిడ.

ఎందుకంత కోపం. ఎదుటి మనిషిని బాధపెట్టే మాట మనము మాత్రం ఎందుకు అనడం. ఒక కార్డు ముక్క రాస్తే పోలే అన్నాడు నరసింహారావు. అప్పటి దాకా ఏదో పుస్తకం చదువుతున్న శాంతి "నాన్నగారూ మీకు అభ్యంతరం లేకపోతే నేను చేసుకుంటాను. అన్న చదువు చెప్పించినందుకు కృతజ్ఞతగా కుటుంబ భారాన్ని మోసే వ్యక్తి బొత్తిగా మొరటు మనిషి అయి ఉండడు. బాధ్యత తెలిసిన వాడై ఉంటాడు. వాస్తవ పరిస్థితులు చెప్పాడంటే జీవన పోరాటంలో కాకలు తీరిన వ్యక్తై ఉండాలి. మనకన్నా నయమై ఉండాలి. ప్రతి క్షణం ఆత్మవంచన చేసుకుంటూ నిరంతర ఘర్షణల మధ్య కాపురం చేసుకునే వారికన్నా నయమే కదా. ఇక కుటుం బాన్ని పోషించడానికి చేసే పనిలో దైవాన్ని వెతికే వ్యక్తికి ఎదుటి మనిషిని ప్రేమించే గుణం ఉంటుంది. ఎదుటి వాళ్ళ మీద ఆపేక్ష చూపించే వ్యక్తిని అలా మాట్లాడడం ఏమీ బాగోలేదు" అంటూ శాంతి కూర్చున్న చోటు నుంచి అవతలకు వెళ్ళిపోయింది. ■